క్లుప్తంగా

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



భక్తి గీతాలను ఆలపిస్తున్న కళాకారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళావేదికపై తిరుపతికి చెందిన అముదాల మురళీ శతవధాని వారిచే దేవీభాగవతం, ప్రకాశం జిల్లా చీమకుర్తికి చెందిన టి.బాలయోగి, బృందం వారిచే భక్తిరంజని కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఆర్‌సీడీఎస్ జిల్లా అధ్యక్షుడిగా శరభారెడ్డి



శరభారెడ్డి

మహానంది: రెడ్డి కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ జిల్లా అధ్యక్షుడుగా అబ్బీపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు శవ్వా శరభారెడ్డిని నియమించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యర్రపు రెడ్డి సురేంద్ర రెడ్డి సోమవారం నియామక పత్రం అందించారు. రెడ్డి సంఘాలను కలుపుకుంటూ రెడ్ల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని సూచించారు.

వినతి



నందికొట్కూరు: పట్టణంలోని సీఎస్ఐ పాలెంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కాలనీవాసులు దొరస్వామి, స్వాములు, శ్రీను, దానమయ్య, ధర్మ, భాస్కర్, శాంతరాజు సోమవారం మున్సిపల్ కమిషనర్ బేబికి వినతి పత్రం అందజేశారు.

నేలకొరిగిన మొక్కజొన్న పైరు



నేల వాలిన మొక్క జొన్న పైరు

ఆత్మకూరురూరల్: ఇటీవల ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు రైతులను కుదేలు చేస్తున్నాయి. ఇప్పటికే ఆత్మకూరు మండలంలో సోయాబీన్ ఎందుకూ పనికిరాకుండా పోగా మొక్క జొన్నపైరు సైతం అధిక వర్షాలకు నేలకు ఒరిగి పోయింది. గింజ పడుతున్న దశలో కంకులు బురదలో పడిపోయి మొలకలెత్తుతుండటంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వమే తమను ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

క్యాన్సర్ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలి



గర్భిణికి పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న ప్రోగ్రామ్ ఆఫీసర్లు

కొత్తపల్లి: క్యాన్సర్ పట్ల మహిళలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్రీయ బాల్ స్వాస్థ్య కార్యక్రమం ప్రోగ్రామ్ ఆఫీసర్ కాంతారావు నాయక్, 104 సంచార చికిత్స ప్రోగ్రామ్ ఆఫీసర్ జగదీష్ చంద్రారెడ్డి సూచించారు. సోమవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వస్థ్ నారీ – స్వశక్త్ పరివార్ కార్యక్రమంలో భాగంగా మహిళలకు ఆత్మకూరు సీహెచ్‌సీ జనరల్ సర్జన్ ప్రసన్న లక్ష్మీ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో వైద్యులు దీపానాగవేణి, గులాబ్‌షా, మహమ్మద్‌బేగ్, ఎంపీడీఓ మేరి, సర్పంచు లక్ష్మీదేవి, జెడ్పీటీసీ సోమల సుధాకర్ రెడ్డి, ఐసీడీఎస్ సూపర్ వైజర్ నాగేశ్వరమ్మ, టీబీ సూపర్ వైజర్ రవికుమార్ పాల్గొన్నారు.

● **బండి ఆత్మకూరు:** నారాయణాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని సింగవరం గ్రామంలో స్వస్థ్ నారీ – స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారి దినేష్ ఆధ్వర్యంలో మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్య జాగ్రత్తలు తెలిపారు.

సాగులో మెలకువలు పాటించండి

జూపాడుబంగ్లా: పంటల సాగులో మెలకువలు పాటించాలని యాగంటిపల్లె కృషివిజ్ఞానకేంద్రం శాస్త్రవేత్తలు సుధాకర్, బాలరాజు, రవిగౌడు తెలిపారు. సోమవారం స్థానిక వెలుగు కార్యాలయంలో రైతులకు పంటల సాగుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీఓ అంబమ్మ, రైతుసేవా కేంద్రాల సిబ్బంది ప్రసన్న, చంద్రకళ, మేరీకేజీయం, భార్గవ్, సీసీలు పుల్లన్న, కర్రెన్న, ధన్‌రాజ్, అకౌంటెంటు ఖైరూన్ తదితరులు పాల్గొన్నారు.

● **కొత్తపల్లి:** ఎదురుపాడు గ్రామ సమీపంలోని ఉల్లి పంటలను ఉద్యానశాఖ అధికారిని చందన సోమవారం పరిశీలించారు.

దేవీనవరాత్రి ఉత్సవాలు ప్రారంభం



నందికొట్కూరులో బాలాత్రిపుర సుందరీ దేవి అలంకారంలో దర్శనం ఇచ్చిన అమ్మవారు



నందికొట్కూరు: పట్టణంలోని శ్రీచక్ర సహిత వాసవీ కన్యకా పరమేశ్వర, చౌడేశ్వరి దేవి ఆలయాల్లో శరన్నవరాత్రులు ప్రారంభమయ్యాయి. ఆయా ఆలయాల్లో అమ్మవార్లు బాలాత్రిపుర సుందరీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే మిడుతూరులోని వాసవీ కన్యకా అమ్మవారిని బాలా త్రిపుర సుందరీ దేవిగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.



తాటిపాడు వీరభద్రస్వామి ఆలయంలో కనకదుర్గ మాతకు పూజలు నిర్వహిస్తున్న భక్తులు

జూపాడుబంగ్లా: దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం నుంచి దేవీనవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. తాటిపాడు, జూపాడుబంగ్లా, తూడిచెర్ల, పారుమంచాల తదితర గ్రామాల్లో అమ్మవారి విగ్రహాలను ప్రతిష్ఠించి భక్తులు భక్తిశ్రద్ధలతో పూజించారు. ఉత్సవాల్లో మొదటి రోజు అమ్మవారు శైలపుత్రి, బాలాత్రిపురా సుందరీమాతగా భక్తులకు దర్శనమిచ్చారు.



నెహ్రూనగర్‌లో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

పగిడ్యాల: మండలంలోని నెహ్రూనగర్, ముచ్చుమర్రి, పగిడ్యాల, బీరవోలు గ్రామాల్లో దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నెలకొల్పిన దుర్గామాత బాలాత్రిపుర సుందరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.



పూజలందుకున్న చౌడేశ్వరీ అమ్మ వారు

పాములపాడు: దేవీ శరన్నవరాత్రుల సందర్భంగా సోమవారం చౌడేశ్వరీ మాతా ఆలయంలో అమ్మవారు బాలాత్రిపుర సుందరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అమ్మ వారికి కాయ, కర్పూరాలు సమర్పించారు.



వెలుగోడులో బాలా త్రిపుర సుందరదేవిగా వాసవీ మాత

వెలుగోడు: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని బాలా త్రిపుర సుందర దేవిగా తీర్చిదిద్ది భక్తులకు దర్శనం కల్పించారు. వేల్పనూరు అంకాలమ్మ శైల పుత్రి దేవిగా ప్రత్యేక పూజలు అందుకన్నారు.

మహానంది: మహానందిలో దసరా శరన్నవ రాత్రి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, పండితులు, రుత్వికులు ఉదయం నుంచి రాత్రి వరకు శాస్త్రోక్తంగా పూజలు చేపట్టారు. పూజా కార్యక్రమాల్లో ఆలయ సూపరింటెండెంట్లు అంబటి శశిధర్ రెడ్డి, ఎం. నీలకంఠేశ్వరరాజు, పి.సుబ్బారెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నాగమల్లయ్య పాల్గొన్నారు. కామేశ్వరీదేవి అమ్మవారు మొదటి రోజు శైలపుత్రీ దుర్గగా భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం అమ్మవారిని మయూర వాహనంపై కొలువు తీర్చి ఆలయ మాడ వీధుల్లో ఉత్సవం నిర్వహించారు.



మహానందిలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం



శ్రీశైలపుత్రీ దుర్గగా అమ్మవారు

ఆత్మకూరు: దసరా మహోత్సవాలు పట్టణంలో వైభవంగా ప్రారంభమయ్యాయి. వాసవీ కన్యకా పరమేశ్వరిదేవి అమ్మవారు శ్రీశైలపుత్రిగా, తోటగేరి చౌడేశ్వరిదేవి బాలాత్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే పలు ఆలయాల్లోని అమ్మవార్లు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు.



ఆత్మకూరులో భక్తులకు దర్శనమిస్తున్న అమ్మవారు

శ్రీశైలంప్రాజెక్ట్: సున్నిపెంటలో దేవీ శరన్నవరాత్సోవాలు ప్రారంభమయ్యాయి. భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. మొదటి రోజు అమ్మవారు వాసవీ వనబాలగా భక్తులకు దర్శనమిచ్చారు.

బండి ఆత్మకూరు: ఓంకార క్షేత్రంలో కొలువైన అమ్మవారు రాజరాజేశ్వరి దేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారికి పూజలు నిర్వహించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఈఓ నాగప్రసాద్ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



వనబాల అలంకారంలో అమ్మ వారు

● **బాలాత్రిపురసుందరీ దేవిగా కొలనుభారతి దేవి**

కొత్తపల్లి: దసరా ఉత్సవాల్లో భాగంగా దేవి శరన్నవరాత్రులు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. మండలంలోని శివపురం గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో వెలసిన కొలనుభారతిదేవి ఆలయంలో సరస్వతి దేవి అమ్మవారు భక్తులకు బాలాత్రిపురసుందరీ దేవిగా దర్శనమిచ్చారు. అమ్మవారికి ఉదయాన్నే ప్రత్యేక అలంకరణ, అభిషేకాలు, పుష్పార్చన, కుంకుమార్చన, మహానైవేద్యం, మహామంగళహారతి వంటి విశేష పూజలు జరిగాయి. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వారి చిన్నారులకు అక్షరాభ్యాసాలు చేయించుకున్నారు.



బాలాత్రిపుర సుందరీ దేవిగా కొలనుభారతి దేవి అమ్మవారు

భవనాశి విస్తరణతోనే శాశ్వత పరిష్కారం

పాములపాడు: భవనాశి నది విస్తరణ చేపడితేనే ఈ ప్రాంత రైతాంగానికి శాశ్వత పరిష్కారం ఉంటుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నాగరాజు, చెలిమిల్ల సర్పంచు కోట్ల చంద్రారెడ్డి అన్నారు. సోమవారం పాములపాడు, చెలిమిల్ల, ఇస్కాల గ్రామాల రైతులతో కలిసి స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్దకు ర్యాలీగా వెళ్లారు. అనంతరం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తహసీల్దార్ సుభద్రమ్మ, ఎంపీడీఓ చంద్రశేఖర్‌లకు అర్జీ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏటా కురిసే భారీ వర్షాల వల్ల, వరదరాజ స్వామి గేట్లు ఎత్తడం వల్ల భవనాశి ఉధృతంగా ప్రవహించడం, పరివాహక ప్రాంతంలోని పంట పొలాలు నీట మునగడం పరిపాటిగా మారిందన్నారు. ఏటా రైతులు వేల ఎకరాల్లో తీవ్ర నష్టాలు చవి చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భవనాశి విస్తరణ చేపట్టడం, ఎస్ఆర్ఎంసీకి అనుసంధానంగా ఇన్‌లెట్‌ఛానల్ నిర్మాణం చేపట్టడం వల్ల భవనాశి నది ప్రవాహం సాఫీగా ఉంటుందని, పాములపాడు మండలంతో పాటు ఆత్మకూరు, కొత్తపల్లి మండలాల రైతాంగానికి ఎంతో మేలు జరుగుతుందన్నారు. స్పందించిన ఎంపీడీఓ, తహసీల్దార్‌లు మాట్లాడుతూ ఇప్పటికే ఆర్డీఓ, ఇరిగేషన్ శాఖ, జిల్లా కలెక్టర్‌కు విషయం తెలియజేశామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రైతు విభాగం నాయకులు మాలిక్, నాగలక్ష్మిరెడ్డి, శేషులు, మనోహర్‌రెడ్డి, కామేశ్వరరెడ్డి, లింగస్వామి, శేఖర్, నాగిరెడ్డి, ప్రసాద్, విజయ్‌కుమార్, చిన్నబాలిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బాధిత రైతులతో ర్యాలీ చేపట్టిన వైఎస్ఆర్‌సీపీ నాయకులు

ప్రతిపాదనలు పంపాం: భవనాశి వంతెన నిర్మాణానికి రూ.6.50 కోట్ల అంచనాతో ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపినట్లు పంచాయతీరాజ్ డీఈ ఈరన్న తెలిపారు. సోమవారం ఆయన ఇస్కాల గ్రామ వద్ద నిండుకుండలా ప్రవహిస్తున్న భవనాసి వంతెనను పరిశీలించారు. వంతెన, బీటీ రహదారి నిర్మాణం తదితర పనుల నిమిత్తం రూ.70 కోట్ల అంచనాలతో ప్రతిపాదనలు పంపామన్నారు. ఆయన వెంట ఏఈ వాహిద్‌సాహెబ్ ఉన్నారు.

●శ్రీగిరికి ఉత్సవ శోభ

శోభాయమానంగా ఉభయ దేవాలయాల అలంకరణ





శ్రీశైల ఆలయంలో వివిధ రకాల పుష్పాలతో అలంకరించిన దృశ్యాలు

శ్రీగిరికి దసరా నవరాత్రోత్సవాల ఉత్సవ శోభతో కళకళలాడుతోంది. శ్రీశైల మహాక్షేత్రంలో దసరా మహోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. దసరా ఉత్సవాలను పురస్కరించుకుని ఉభయ దేవాలయాలలోని ధ్వజస్తంభాలను, ఆలయాల ప్రధాన ద్వారాలను వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. స్వామిఅమ్మవార్ల సందర్శనకు వచ్చిన పలువురు భక్తులు ఆలయంలో పూలతో అలంకరించిన సుందర దృశ్యాలను చూసి ముగ్ధులవుతున్నారు. దీంతో శ్రీశైలంలో దసరా మహోత్సవాల కళ ఉట్టిపడుతోంది. – శ్రీశైలంటెంపుల్

యూరియా పంపిణీ

బండి ఆత్మకూరు: మండల పరిధిలోని లింగాపురంలో రైతులకు వ్యవసాయాధికారులు యూరియా పంపిణీ చేశారు. లింగాపురం గ్రామానికి 528 బస్తాల యూరియా సరఫరా కావడంతో రైతులు సోమవారం పెద్ద ఎత్తున రైతు సేవా కేంద్రం వద్దకు తరలి వచ్చారు. తక్కువ యూరియా బస్తాలు రావడంతో రైతులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. తమకు సరిపడా యూరియా ఇవ్వడంలో అధికారులు విఫలమయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిస్థితి అదుపు తప్పడంతో సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని టోకెన్ల ప్రకారం యూరియాను సరఫరా చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పవన్‌కుమార్, వ్యవసాయ విస్తరణ అధికారి మధు పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ

వెలుగోడు: మండలంలోని సచివాలయాలను ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి తనిఖీ చేశారు. సోమవారం రేగడగూడూరు, వేల్పనూరు గ్రామ సచివాలయాలను ఎంపీడీఓ సందర్శించి అటెండెన్స్ రిజిస్టర్లు, ఫిర్యాదుల పట్టికలు, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు సచివాలయ సిబ్బంది కృషి చేయాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిని ఉపేక్షించబోమని హెచ్చరించారు. సకాలంలో సర్వేలు పూర్తి చేయాలని, వాహనమిత్ర డేటాను అప్‌లోడ్ చేయాలని సూచించారు.

రైతు సమస్యలను విస్మరించిన కూటమి ప్రభుత్వం

నందికొట్కూరు: కూటమి ప్రభుత్వం రైతు సమస్యలను విస్మరించిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.ప్రభాకర్‌రెడ్డి విమర్శించారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గిట్టుబాటు ధరలు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదన్నారు. ఉల్లి రైతులకు ఎకరాకు రూ.50 వేలు ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. టమాట రైతుల వద్ద నుంచి కిలో రూ.15 చొప్పున ప్రభుత్వమే కొనుగోలు చేసి ఆదుకోవాలన్నారు. బొప్పాయి, చీని, అరటి, పొగాకు రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాలన్నారు. మిడుతూరు మండలానికి హంద్రీనీవా కాలవ నుంచి సాగు, తాగు నీరు అందించాలన్నారు. సమావేశంలో సీపీఎం నాయకులు నాగేశ్వరరావు, రామకృష్ణ, శ్రీనివాసులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కే. ప్రభాకర్‌రెడ్డి

ఖాళీలను భర్తీ చేయాలి

కొత్తపల్లి: మండలంలోని ఎర్రమఠం ప్రాథమిక వైద్యశాలలో సిబ్బంది కొరత వల్ల వైద్య సేవలు సక్రమంగా అందక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని ప్రభుత్వం ఈ వైద్యశాలలో ఉన్న ఖాళీలను భర్తీ చేసి సిబ్బంది కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి ఎన్ స్వాములు, మండల నాయకుడు దినేష్ డిమాండ్ చేశారు. సోమవారం వారు తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో డిప్యూటీ తహసీల్దార్ అరుణకు వినతి పత్రం అందజేశారు.

ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

నందికొట్కూరు: ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి ఆది డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని పటేల్ సెంటర్‌లో రాస్తారోకో నిర్వహించారు. అనంతరం రెవెన్యూ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.6,400 కోట్ల ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల కాకపోవడంతో ప్రైవేట్ విద్యాసంస్థలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా వేధింపులకు గురి చేస్తున్నాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తక్షణమే బకాయిలు విడుదల చేసి కళాశాలలకు, విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాసులుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు శ్యాంనాయక్, శివ, సూరి, ఆది, అంజి, రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి రాస్తారోకో చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

సమస్యలు పరిష్కరించాలి

శ్రీశైలంప్రాజెక్ట్: తమ సమస్యలు పరిష్కరించాలంటూ ఆశా వర్కర్లు సోమవారం సున్నిపెంట తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. రూ.1,50,000 గ్రాట్యూటీ, 180 రోజుల ప్రసూతి సెలవులు, 62 ఏళ్ల పదవీ విరమణ వయస్సు తదితర బెనిఫిట్స్ ప్రభుత్వం ప్రకటించినప్పటికీ జీఓ విడుదల చేయకపోవడం తగదని ఆశా వర్కర్లు ఆదిలక్ష్మి, నాగమణి, సుహాసిని, శోభ, ఏఐటీయూసీ నాయకులు పులిరాజు అన్నారు. జీఓ విడుదల చేయడంతోపాటు కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని, 2జీ సిమ్‌కు బదులుగా 5జీ సిమ్ అందజేయాలని కోరారు. ఈఎస్ఐ, ఈపీఎఫ్ వర్తింపచేయాలని, నాణ్యమైన యూనిఫాంతో పాటు జిల్లా వైద్యాధికారి సంతకంతో కూడిన గుర్తింపు కార్డును ఇవ్వాలని డిమాండ్ చేశారు. విధి నిర్వహణలో కార్యకర్త మృతిచెందితే రూ..10,00,000 ఎక్స్‌గ్రేషియా, రూ.10,00,000 గ్రూప్ ఇన్సూరెన్స్, కుటుంబ సభ్యులలో ఒకరికి ఉద్యోగం, దహన ఖర్చులకు రూ.20,000 ఇవ్వాలని కోరారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ కె.వి. శ్రీనివాసులుకు అందజేశారు.

‘ఉల్లాస్ అక్షరాంధ్ర’లో భాగస్వాములవ్వాలి



బుక్స్ పంపిణీ చేస్తున్న నోడల్ ఆఫీసర్ భాస్కర్‌రెడ్డి

వెలుగోడు: ‘ఉల్లాస్ అక్షరాంధ్ర’ అక్షరాస్యత కార్యక్రమంలో అందరూ భాగస్వాములవ్వాలని వయోజన విద్య శాఖ నోడల్ ఆఫీసర్ బీవీ భాస్కర్‌రెడ్డి సూచించారు. పట్టణంలోని స్త్రీ శక్తి భవనంలో వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉల్లాస్ అక్షరాంధ్ర ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వయోజనులైన నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా చేయడానికి డీఆర్‌డీఏ, డ్వామా, మెప్మాల ద్వారా ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. పొదుపు సంఘాల్లో చదువుకున్న సభ్యులు మిగతా వారిని అక్షరాస్యులుగా మార్చేందుకు చొరవ చూపాలన్నారు. అభ్యసన పూర్తయిన తరువాత అభ్యాసకులందరికీ మార్చిలో పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వయోజన విద్యా సూపర్ వైజర్ ఎస్.శ్రీనివాస్, ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి

జూపాడుబంగ్లా: నేటి నుంచి మూడు రోజులపాటు మండలంలోని వివిధ గ్రామాల్లో నిర్వహించే ప్రత్యేక ఆధార్ కేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ ఎంపీడీఓ పద్మావతి తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ ఈనెల 23న జూపాడుబంగ్లా, తంగడంచ, 24న 80బన్నూరు, తంగడంచ, 25న 80బన్నూరు, తర్తూరు, 26న 80బన్నూరు, మండ్లెం-1 గ్రామ సచివాలయాల్లో ప్రత్యేక ఆధార్‌కేంద్రాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల్లోని ప్రజలు, విద్యార్థులతో పాటు సమీప గ్రామాల్లోని వారు కూడా ప్రత్యేక ఆధార్‌కేంద్రాలను సద్వినియోగం చేసుకోవచ్చన్నారు.

బాపట్ల ఎమ్మెల్యేపై కేసు నమోదు చేయాలి

ఆత్మకూరు: నాయీ బ్రాహ్మణులను కించపరిచి మాట్లాడిన బాపట్ల ఎమ్మెల్యే వేగసిన నరేంద్రవర్మ రాజుపై కేసు నమోదు చేయాలని నాయీ బ్రాహ్మణ సేవా సంఘం ఆత్మకూరు అధ్యక్షుడు పగిడ్యాల శివపాములేటి డిమాండ్ చేశారు. సోమవారం ఆయన ఆత్మకూరులో నాయీబ్రాహ్మణుల సంఘం సభ్యులతో కలిసి మాట్లాడారు. కులవృత్తి దారుల మనోభావాలు దెబ్బతీసేలా ఎవరు మాట్లాడినా సహించేది లేదన్నారు. ఒక పార్టీని విమర్శించే ప్రక్రియలో నాయీబ్రాహ్మణులు బాధపడేలా అవమానించేలా మాట్లాడాల్సిన అవసరం ఏమిటని ప్రశ్నించారు. కుల వృత్తిదారులను అవమానించేలా మాట్లాడే వారికి రాజకీయ భవిష్యత్ లేకుండా చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో కమిటీ సభ్యులు శివన్న, ఎల్లప్ప, పెద్దస్వాములు, బోధనం సుబ్బరాయుడు, గువలకుంట్ల వెంకటేశులు, అనిల్, రుద్రప్రసాద్, జనార్దన్, శేఖర్ రమణ, ప్రసన్న, శివదుర్గ, నాగేశ్వరరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శివపాములేటి

కంప చెట్ల తొలగింపు

మహానంది: భారీ వర్షాలతో బుక్కాపురంలోని తమ్మడపల్లె ఇంజవాణి చెరువు అలుగులు దాటి నీరు ప్రవహించింది. దీంతో రోడ్డుపై సుమారు మూడు అడుగుల మేర నీరు చేరింది. నీరు తగ్గిన తర్వాత బుక్కాపురం సర్పంచ్ కందుల వరలక్ష్మమ్మ తన వంతు బాధ్యతగా రోడ్డుపై పేరుకుపోయిన కంప చెట్లను తొలగించి వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చేశారు. మరో వైపు మహానంది నుంచి గాజులపల్లె వెళ్లే మార్గంలోని పాలేరు శాంతించింది. వరదనీరు తగ్గుముఖం పట్టగా రోడ్డుపై బురద, కొట్టుకొచ్చిన చెట్లు అలాగే ఉండిపోయాయి. గాజులపల్లె ఆర్ఎస్ సర్పంచ్ అస్లాం బాషా ప్రొక్లెయినర్‌తో వాటిని తొలగించి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చేశారు.



బుక్కాపురం అలుగు వద్ద రోడ్డుపై కంపచెట్లను తొలగిస్తున్న సర్పంచ్ వరలక్ష్మమ్మ

భార్యాభర్తలకు గాయాలు

పాములపాడు: మండలంలోని ఎర్రగూడూరు గ్రామం వద్ద చోటుచేసుకున్న బైక్ ప్రమాదంలో భార్యాభర్తలు గాయపడ్డారు. మిట్ట కందాల గ్రామానికి చెందిన ఎరుకలి మద్దిలేటి, సుబ్బలక్ష్మి దంపతులు సోమవారం రాత్రి ఆత్మకూరు నుంచి బైక్‌పై బయలుదేరారు. ఘటనా స్థలం వద్దకు చేరుకోగా అదుపుతప్పి కిందపడ్డారు. గాయపడిన దంపతులను స్థానికులు ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం డాక్టర్లు కర్నూలుకు రెఫర్ చేశారు.

అర్హులందరికీ పింఛన్లు మంజూరు చేయాలి



మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

నందికొట్కూరు: అర్హులందరికీ పింఛన్లు మంజూరు చేయాలని సీపీ(ఎంఎల్) లిబరేషన్ జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సోమవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట అర్హులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 16 నెలలు దాటినా ఒక్క పింఛన్ కూడా మంజూరు చేయలేదన్నారు. ఇప్పటికైనా కొత్త పింఛన్లు మంజూరు చేయాలని మున్సిపల్ కమిషనర్ బేబికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గాబ్రెల్, లక్ష్మిదేవి, మల్లయ్య, మర్తుజాబి, రామకృష్ణ, సుధాకర్, మహ్మద్, భాస్కర్, కృష్ణుడు, సోమప్ప పాల్గొన్నారు.